క్లుప్తంగా

నేడు తాటికొండలో టెండర్లు

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ–జిట్టెగూడెం గ్రామాలకు సంబంధించిన సమ్మక్క– సారలమ్మ జాతరకు శనివారం టెండర్లు నిర్వహించనున్నట్లు రెండు గ్రామాల సర్పంచ్‌లు చల్లా ఉమా సుధీర్‌రెడ్డి, మాలోతు లలిత, వైస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డి తెలిపారు. తాటికొండ గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం టెండర్ల నిర్వహణపై వివరాలను వెల్లడించారు. ఫిబ్రవరిలో నిర్వహించే సమ్మక్క–సారలమ్మ జాతరలో ఏర్పాటు చేసుకునే వివిధ దుకాణాలకు టెండర్లను నిర్వహించడం జరుగుతుందని టెండర్లు వేసే వారు ఉదయం 10 గంటల వరకు జీపీ కార్యాలయంకు హాజరై టెండర్లకు డిపాజిట్లు చెల్లించి టోకెన్లు తీసుకోవాలని కోరారు.

విప్‌ను కలిసిన నాయకులు

బచ్చన్నపేట : రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను మండల కు రుమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం యాదగిరిగుట్టలోని ఆయన నివాసంలో కలిసి పూల బొకేను అందించి శాలువాలతో సన్మానించారు. అనంత రం పలువురు నాయకులు మాట్లాడుతూ అయిలయ్య విప్‌గా నియమితులవడం చాలా సంతోషమన్నారు. రాష్ట్రంలో ప్రముఖ పుణ్య క్షేత్రాలైన కురుమల ఆరాధ్యదైవమైన కొమురవెల్లి, అయినవోలు దేవస్థానాల చైర్మన్ పదవులను కురుమలకు కేటాయించాలని కోరామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ బేజాడి సిద్దులు, నాయకులు మల్గ సిద్దిరాములు, శ్రీనివాస్, సిద్దులు, కర్ణాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుణమాఫీ చెక్కు అందజేత



లింగాలఘణపురం: మండలంలోని క్లాం పీఏసీఎస్ పరిధిలోని సభ్యుడు జిల్లెల శంభారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన పేరుతో వచ్చిన రుణమాఫీ రూ.95,872లు చెక్కును అతని భార్య శకుంతలకు శుక్రవారం సొసైటీ చైర్మన్ ఉపేందర్ అందజేశారు. ఉపాధ్యక్షుడు విజయభాస్కర్, డైరెక్టర్లు మూర్తి, గణేష్,కుమార్, ప్రతా ప్‌రెడ్డి, రాములు, మల్లయ్య, సీఈఓ మల్లేశం ఉన్నారు.

స్వర్ణప్రాశన పంపిణీ



జనగామ: జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డులోని వేద ఆయుర్వేదిక్ పంచకర్మ, వెల్నెస్ సెంటర్‌లో శుక్రవారం చిన్నారులకు స్వర్ణప్రాశాన్ని ఉచితంగా వేశారు. ఆస్పత్రి డాక్టర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో 150 మంది పిల్లలకు స్వర్ణప్రాశం వేసిన తర్వాత మాట్లాడుతూ ప్రతినెలా పుష్యమి నక్షత్రం రోజు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



తరిగొప్పుల: మండల కేంద్రం శివారు జగ్గయ్యపేట సమీపంలో నిర్మించనున్న పెద్దమ్మతల్లి ఆలయానికి మత్స్యశాఖ సహకార సంఘం మండల అధ్యక్షుడు చిలువేరు ఉప్పలయ్య ఆధ్వర్యంలో శుక్రవారం భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ సహకార సంఘంలోని నిధులతో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. గుడి నిర్మాణం త్వరగా పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు దండెబోయిన రాములు, ఉపసర్పంచ్ అంకం శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మీదేవి కుంకుమార్చన పూజలు



జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్‌లో శ్రీ గోదారంగనాథస్వామి ఆలయంలో మహాలక్ష్మీదేవి కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ముందుగానే ఏర్పాట్లు చేశారు. సింహాచల వేద పాఠశాల అధ్యాపకులు జనార్ధనచార్యులు నేతృత్వంలో ఈ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మహిళలు మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వకులాదేవి, మహిళలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందరికీ అందించాలి

● జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



రఘునాథపల్లి : గోవర్ధనగిరిలో ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రజాపాలన ప్రత్యేకాధికారిని కరుణ

జనగామ: అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అందే విధంగా చూడాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 4, 8, 9, 13 వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమ శిబిరాలను ఆయన సందర్శించారు.అనంతరం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలన చేసి, ప్రజలతో మాట్లాడారు. ఆయన వెంట మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ తాళ్ల సురేష్‌రెడ్డి, ఏబేలు, నర్సింహులు, విజయ్, సందీప్, రామక్రిష్ణ, సలీం ఉన్నారు.

నర్మెట: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో సీఈఓ అనిల్ కుమార్, మండల ప్రత్యేక అధికారి దామోదర్‌రావు, ఎంపీఓ అరవింద్ చౌదరి, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట : ప్రభుత్వ పథకాలను పార్టీల కతీతంగా అర్హులైన పేదలందరికి అందించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని పోచన్నపేటలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని సందర్శించారు.

అభయహస్తం కేంద్రాలను పరిశీలించిన కరుణ

రఘునాథపల్లి/స్టేషన్‌ఘన్‌పూర్: అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను మహిళా, శిశు సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి, ప్రజా పాలన ప్రత్యేకాధికారిని వాకాటి కరుణ సందర్శించారు. కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ పర్మార్ పింకేష్‌కుమార్‌లతో కలిసి శుక్రవారం మండలంలోని గోవర్ధనగిరిలో ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వహణ వివరాలు అడిగి తెల్సుకున్నారు. ఏమైనా సందేహాలు ఉంటే కంట్రోల్ రూమ్‌లోని 8716293880లో సంప్రదించాలని పేర్కొన్నారు. ఆమె వెంట డీసీపీ సీతారాం, డీఏఓ వినోద్‌కుమార్, ఘన్‌పూర్‌లో నిర్వహించిన గ్రామసభలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని కరుణ జిల్లా కలెక్టర్ సీహెచ్.శివలింగయ్యతో కలిసి పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణలో సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు.

బచ్చన్నపేట : దరఖాస్తు దారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని జనగామ జిల్లా అదనపు కలెక్టర్ సుహాసిని అన్నారు. శుక్రవారం మండలంలోని బండనాగారం, పోచన్నపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. పోచన్నపేటలో తహసీల్దార్ విశాలాక్షి, బండనాగారం, లక్ష్మాపూర్ గ్రామాల్లో ఎంపీడీఓ రఘురామకృష్ణలు నిర్వహించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

తరిగొప్పుల: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సుహాసిని అన్నారు. మండలంలోనిపోతారం, సోలిపూరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లను ఆమె శుక్రవారం సందర్శించారు.



నర్మెట : దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పల్లా



చిల్పూరు : మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాసరావు



జనగామ రూరల్: గానుగుపహాడ్‌లో దరఖాస్తు ప్రక్రియను ప్రారంభిస్తున్న అనిల్ కుమార్



తరిగొప్పుల: దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుహాసిని

గొడవలు లేకుండా అందజేయండి

చిల్పూరు: ఒక్క రోజుతోనే దరఖాస్తుల స్వీకరణ అయిపోదని అందుకు గొడవలు లేకుండా అందజేస్తూ అధికారులకు సహకరించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ సుందరగిరి శ్రీనివాస్‌రావు దరఖాస్తుదారులకు సూచించారు. మండలంలోని మల్కాపూర్‌లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను శుక్రవారం ఏసీపీ పరిశీలించారు.

లింగాలఘణపురం: మండలంలో ప్రజాపాలన ఆరు గ్యారంటీల దరఖాస్తులు శుక్రవారం రెండో రోజు 1350 వచ్చాయి. తహసీల్దార్ వినయలత, ఎంపీడీఓ సురేందర్ ఆధ్వర్యంలో రెండు బృందాలు నాలుగు గ్రామాల్లో దరఖాస్తులు తీసుకోగా నెల్లుట్ల, కుందారంలో దరఖాస్తులు తీసుకున్నారు.

రఘునాథపల్లి: మండలంలోని మండలగూడెం, ఖిలాషాపూర్, కుర్చపల్లి, గోవర్ధనగిరి, అశ్వరావుపల్లి, భానాజీపేటలో శుక్రవారం జరిగిన ప్రజా పాలనలో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మేకల వరలక్ష్మి, జెడ్పీటీసీ అజయ్, తహసీల్దార్ యుగేందర్, పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి (జి), కూనూర్‌లో రెండో రోజు గ్రామ సభలు శుక్రవారం నిర్వహించారు. కూనూర్‌లో ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ బేబి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జనగామ రూరల్: ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా ప్రజల నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా దరఖాస్తులు స్వీకరించాలని ప్రత్యేక అధికారి అనిల్ కుమార్ అన్నారు.

కొడకండ్ల : ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని పాలకుర్తి నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డీపీఓ రంగాచారి సూచించారు. శుక్రవారం మైదంచెరువుతండాలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు.

దేవరుప్పుల : మండలంలోని కామారెడ్డిగూడెం, చిన్నదూరులో ఎంపీపీ సావిత్రి, మండల ప్రత్యేక అధికారులు కె రాము(డీఈఓ), హుస్సేన్(ఆర్‌అండ్‌బీఈఈ) వేర్వేరుగా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ప్రజలకు కాంగ్రెస్ అభయహస్తం

● డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగున్నర కోట్ల ప్రజలకు అభయహస్తంగా మారిందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా పట్టణంలో 13, 8వ వార్డులో ఏర్పాటు చేసిన దరఖాస్తుల స్వీకరణ శిబిరాల వద్దకు వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న అభయహస్తం పథకం కింద ఆరు గ్యారెంటీలు అర్హులైన ప్రజలందరికీ అందించే విధంగా దరఖాస్తుల స్వీకరణ కోసం అన్ని గ్రామాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళరాజు, పీసీసీ సభ్యులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వేమళ్ళ సత్యనారాయణ, వంగాల మల్లారెడ్డి, మేడ శ్రీనివాస్, బనుక శివరాజ్ యాదవ్, ఉడుత రవి, చెంచారపు బుచ్చిరెడ్డి, ,ధర్మ గోవర్ధన్ రెడ్డి, గణిపాక మహేందర్, ప్రభాకర్, నర్సింగరావు, సిద్దిరాములు, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



మహా పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు, గ్రామస్తులు

జఫర్‌గఢ్ : మండల కేంద్రంలో అయ్యప్ప మహా పడిపూజ మహోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధల మధ్య శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో స్థానిక రామాలయం వద్ద నిర్వహించిన పడిపూజ కన్నుల పండువగా సాగింది. వివిధ గ్రామాల నుంచి అయ్యప్ప భక్తులతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత అయ్యప్ప భక్తులు మెట్లతో ప్రత్యేక మండపాన్ని అలంకరించారు. మధ్యలో స్వామి అయ్యప్పతో పాటు లక్ష్మి, వినాయకుడి చిత్రపటాలను పెట్టి వివిధ రంగుల పూలతో ముస్తాబు చేశారు. అనంతరం అయ్యప్ప గురుస్వాములు ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి శరణం, అయ్యప్ప, శరణం, శరణం అయ్యప్ప శరణం అంటూ భక్తులు చేసిన శరుణుఘోశతో భక్తిభావం ఉప్పొంగింది. పూజ కార్యక్రమం అనంతరం మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అయ్యప్ప భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన కలిగి ఉండాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

బచ్చన్నపేట : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి గ్రామీణ ప్రాంత ప్రజలు అందరూ అవగాహన కలిగి ఉండాలని సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ శివశంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మాపూర్, సాల్వాపూర్ గ్రామాల్లో వికసిత భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హత కలిగిన వారందరూ వినియోగించుకొని లబ్ధి పొందాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నూకల నవ్యానర్సిరెడ్డి, కీసర లక్ష్మిబాగులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, మహిళా సంఘాల సభ్యులు, పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి కల్యాణం



స్వామివారి వారి విగ్రహాలను తీసుకొస్తున్న దాతలు

నర్మెట: మండలకేంద్రంలోని కాకతీయుల కాలం నాటి అతిపురాతన దేవాలయంలో పాతికేండ్ల క్రితం పునఃప్రతిష్ఠించిన శ్రీవేంకటేశ్వరస్వామి, ఉభయ దేవేరుల వార్షిక కల్యాణాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించిన పురోహితులు స్వామివారి పూజ, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలతోపాటు యజ్ఞోపవీత ధారణ, మధుపర్కం, సుముహూర్తంలో కన్యాదానం మాంగల్యధారణ నిర్వహించి తలంబ్రాలు బ్రహ్మముడితో శ్రీదేవి, భూదేవి సహిత మలయప్ప స్వామి వారి కల్యాణాన్ని కనులపండుగగా నిర్వహించారు. పురోహితుడు పార్నంది సతీష్ శర్మ తంతు నిర్వహించగా చల్లా వెంటేశ్వర్‌రెడ్డి, వసంత, మడికొండ శేఖర్, గొట్టె రాజశేఖర్ దంపతులు కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గోపగోని సతీష్, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



చిల్పూరు : మృతదేహంపై పూలమాల వేస్తున్న కడియం శ్రీహరి



తరిగొప్పుల: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన ఉమ్మడి వరంగల్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ చింతకుంట్ల ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, బూర్ల శంకర్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గన్ను నర్సింహులు, డాక్టర్ జైహింద్‌రాజు, కిషన్‌రాజు, చేరాలు, రాజు, వెంకట్ రెడ్డి, సోమన్న ఉన్నారు. అలాగే మండలంలోని విశ్వనాథపురానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గుర్రపు నర్సింగరావు, మండల కేంద్రానికి చెందిన ఉమ్మడి వరంగల్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ చింతకుంట్ల ప్రభాకర్‌రెడ్డిలు మృతి చెందగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభాకర్‌రెడ్డి మృతి పట్ల తెలంగాణ వి జయడెయిరీ పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ సాదం రమేష్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

తరిగొప్పుల : మండలకేంద్రానికి చెందిన ఎంపీటీసీ అర్జుల మదుసూదన్‌రెడ్డి తల్లి భారతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా బాధిత కుటుంబసభ్యులను టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్, వేముల సత్యనారాయణరెడ్డి, ముడావత్ సంపత్‌నాయక్, పలుచారి రమేష్, శ్రావణ్‌రెడ్డి, శివకుమార్, రాములు, సమ్మయ్య ఉన్నారు.

చండిక అమ్మవారికి పంచామృత అభిషేకం



అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీచండిక అమ్మవారికి శ్రీసూక్త విధానేన పంచామృత అభిషేకం, పట్టువస్త్రాలతో విశేష అలంకరణ, శ్రీలలిత సహస్రనామా పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, అర్చకులు, సిబ్బంది, పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో సరుకులు పెంచాలి

చిల్పూరు: కొత్త రేషన్‌కార్డులను అందిచండంతో పాటు రేషన్ షాపుల్లో నిత్యావసర సరుకులు పెంచి పేదలను ఆదుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నియోజకవర్గ ఇన్‌చార్జ్ మారపాక రమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రేషన్ షాపుల ద్వారా అందించే నిత్యావసర సరుకులు తగ్గించి కేవలం దొడ్డు బియ్యం అందించడంతో పేదలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నిత్యావసర సరుకులను వ్యాపారులు బ్లాక్ మార్కెట్ చేయడంతో ధరలు పెరిగినందున వాటిని తగ్గించాలంటే రేషన్ షాపుల ద్వారా దొడ్డు బియ్యంకు బదులు సన్న బియ్యంతో పాటు ఇతర వస్తువులు అందిస్తే అందరికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

వ్యర్థాలతో నిండిన మురుగు కాల్వ



ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన డ్రెయినేజీ కాల్వ

తరిగొప్పుల: మండలకేంద్రం అబ్దుల్‌నాగారం రోడ్డులో ఉన్న ప్రధాన మురుగు కాల్వలో నీరు ముందుకు కదలడంలేదు. వ్యర్థాలు, మట్టితో డ్రెయినేజీ నిండిపోయింది. ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగునీరు ముందుకు కదలకుండా నిలిచిపోయింది. దీంతో కాలువలో పందులు స్వైర్య విహారం చేస్తున్నాయి. కాలువల నుంచి వస్తున్న దుర్గంధం, దోమల బెడదను భరించలేక పోతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

‘ప్రజాపాలన’పై అనూహ్య స్పందన



తిర్మలగిరిలో దరఖాస్తులను తీసుకుంటున్న అధికారులు

పాలకుర్తి: మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో దరఖాస్తుల సేకరణ ప్రారంభం కావడంతో ప్రజల్లో మంచి స్పందన కనిపించింది. శుక్రవారం 06 గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులను తీసుకున్నారు. మండలం మొత్తం రెండో విడత 12 గ్రామ పంచాయతీలో 1134 దరఖాస్తులను ప్రజాపాలన కార్యక్రమంలో అధికారులు తీసుకున్నారు. దరఖాస్తుల సేకరణలో డీపీఓ రంగాచారి, పీడీ డీఆర్‌డీఏ మొగులప్ప, ఎంపీడీఓ అశోక్‌కుమార్, తహసీల్దార్ వెంకటేశం, ఎంపీఓ రవి కుమార్, సీడీపీఓ జయంతి, సర్పంచ్‌లు, వివిధ గ్రామాల కార్యదర్శులు, ఆశ వర్కర్లు, వీవోఏలు, విద్యుత్ ఏఈ, ఇరిగేషన్ ఏఈ, అగ్రికల్చర్ ఏఈఓలు పాల్గొన్నారు.

‘తిరుకుటుంబ’ ఉత్సవాలు షురూ..

● కడవెండి తిరుకుటుంబం చర్చికి నేటికి 115 ఏళ్లు పూర్తి



మేరీమాత, యేసు విగ్రహాలతో వీధుల్లో ప్రదర్శన

దేవరుప్పుల : మండలంలోని కడవెండిలో స్థిరపడిన క్రైస్తవ కుటుంబాలు ఏర్పర్చుకున్న తిరుకుటంబం చర్చి ఆవిర్భావ ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నూట పదిహేనళ్ల కిందట గుంటూరు నుంచి ఇక్కడికి జీవనోపాధి కోసం వచ్చిన రెడ్డి కుటుంబాలు వ్యవసాయ జీవనాధారంగా స్థిరపడ్డారు.ఈ క్రమంలోనే యేసును ఆరాధించుకునేందుకు చిన్నపాకలో ప్రార్థన మందిరాన్ని ఏర్పర్చుకొని తదనంతరం రేకులషెడ్డు నుంచి ఫాదర్ అంథోనిస్వామి పర్యవేక్షణలో పక్కా ప్రార్థన భవన మందిరాన్ని నిర్మించుకున్నారు. నాటి నుంచి నేటి వరకూ ఏటా డిసెంబర్ చివరి వారంలో తిరుకుటుంబం చర్చి పండుగ నిర్వహణతో జాతరను తలపిస్తోంది. శుక్రవారం చర్చి విచారణ గురువు ఫాదర్ ఆనందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మేరీమాత, యేసు విగ్రహాలతో పురవీధుల్లో తిరిగి ప్రజాశీర్వచనాలు పొందారు.

వరి నాట్లకు కూలీల కొరత

● బిహార్ నుంచి వచ్చి నాట్లు వేస్తున్న కూలీలు




అబ్దుల్‌నాగారంలో నాట్లు వేస్తున్న బీహార్ కూలీలు

తరిగొప్పుల: యాసంగి పంట సాగుపై భారీ ఆశలు పెటుకున్న రైతన్నకు కూలీల కొరత వేధిస్తోంది. నీరు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్న వ్యవసాయ కూలీలు దొరకక రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారు. నాట్లు వేయడానికి కూలీలు లేక పంట సాగు ఆలస్యమవుతోంది. సొంతూళ్లలో కూలీలు దొరక్కపోవడంతో బిహార్ నుంచి వచ్చిన కూలీలతో నాట్లు వేయిస్తున్నారు. ఒక్క ఎకరానికి రూ.5000 చెల్లించి గుత్త వరి నాట్లు వేయించుకుంటున్నారు. దీంతో పెట్టుబడి అధికమవుతుందని రైతన్నలు దిగాలు చెందుతున్నారు.

విద్యార్థులకు అందిన తాగునీరు

సాక్షి స్పందన



పైపులెన్ ఏర్పాటు చేస్తున్న జీపీ సిబ్బంది

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు శనివారం ఎంపీటీసీ తాళ్లపల్లి ఉమసమ్మయ్య పైపులైన్ వేయించి విద్యార్థులకు తాగునీరు అందించారు. విద్యార్థులకు తాగునీరు అందించాలి అంటూ శుక్రవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీటీసీ భర్త మాజీ సర్పంచ్ తాళ్లపల్లి సమ్మయ్య శనివారం జీపీ సిబ్బందితో పైపులైన్ నుంచి ప్రత్యేకంగా ట్యాంకుల్లోకి పైపులను వేయించి నీటిని వదిలారు. దీంతో పాఠశాలలో తాగునీటి సమస్య తీరింది.